క్లుప్తంగా

13న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న పాడేరు ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ రాము

పాడేరు : పాడేరు ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ కోర్టులో సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని పాడేరు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఎ.రాము సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన పోలీసు అధికారులు, న్యాయవాదులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను ఇరువర్గాల ఏకాభిప్రాయంతో రాజీ చేసుకునేందుకు మంచి అవకాశమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఐ దీనబంధు, ఎస్‌ఐలు సురేష్, షణ్ముఖరావు, రామకృష్ణ, రమణ, సూర్యనారాయణ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిగా సుధాకర్ బాధ్యతల స్వీకరణ



హుకుంపేట: మండల నూతన వ్యవసాయ అధికారిగా కె.సుధాకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో విజయనగరంలో వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహించి హుకుంపేటకు బదిలీపై వచ్చినట్టు ఆయన తెలిపారు. గిరిజనులకు ఉత్తమ సేవలు అందిస్తానని ప్రజలకు వ్యవసాయ రంగంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రైతులు తమ సమస్యలను 8331056443 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన వ్యవసాయ అధికారి మాధురి చరణ్య అనకాపల్లికి బదిలీపై వెళ్లారు.

డొక్కపాలెంలో న్యాయవిజ్ఞాన సదస్సు



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది రమణ

అడ్డతీగల: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అడ్డతీగల మండలం డొక్కపాలెంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాది కె.ఎస్.వి రమణ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టప్రకారం శిక్షార్హులు అవుతారన్నారు. ఎర్లీ ప్రెగ్నెన్సీ వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమై బాలికల జీవితాలు సర్వ నాశనం అవుతాయన్నారు. బాల్య వివాహాల చట్టం తదితర అంశాలను ఆయన వివరించారు. న్యాయవాది ఇ.గౌరీశంకర్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పీడీ దృష్టికి అంగన్‌వాడీల సమస్యలు

గూడెంకొత్తవీధి: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల సీఐటీయూ నేతలు బుజ్జిబాబు, సత్యనారాయణ తదితరులు ఐసీడీఎస్ పీడీ ఝాన్సీభాయిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని కోరారు. గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు, అంగన్‌వాడీ సంఘం నాయకులు సత్యవతి, అప్పలనర్స, వెంకట్ తదితరులున్నారు.

ఘనంగా కుంకుమ పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

సీలేరు: సీలేరులో పలు వీధుల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అల్లూరి వీధిలోని మండపం వద్ద శనివారం కుంకుమార్చన పూజలు నిర్వహించారు. వినాయక మాలలు ధరించిన భక్తులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. శివాలయం మండపం వద్ద చిన్న పిల్లలతో తాడు లాగే ఆటను కోలాహలంగా నిర్వహించి వారిలో ఉత్సాహాన్ని మరింత పెంచారు. మార్కెట్ సెంటర్ వర్తక సంఘం మండపం వద్ద సాయి బాబా కోలాటం భజన బృందం ద్వారా భజన, చిన్న పిల్లలతో హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చినట్టు కమిటీ సభ్యులు తెలపారు.

చదువులు అగమ్యగోచరం

- కానరాని ఉపాధ్యాయులు
- కొనసాగని తరగతులు
- అయోమయంలో విద్యార్థులు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ఉపాధ్యాయులు లేక ఖాళీగా ఉన్న తరగతి గది

సీలేరు: మన్యంలో సర్కారు విద్య గాడి తప్పింది. పాఠశాలలో చదువులు నేర్చుకునేందుకు విద్యార్థులు ఉన్నా... పాఠాలు బోధించేందుకు ఉపాధ్యాయులు మాత్రం కరువయ్యారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు అయోమయంలో పడింది. వేసవి సెలవుల అనంతరం పాఠశాల తెరిచినప్పటి నుంచి ఇప్పటివరకు ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయులు ఎప్పుడు వస్తారని పాఠాలు ఎప్పుడు బోధిస్తారని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం తమ చిన్నారుల పాలిట శాపంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఏకైక జిల్లా పరిషత్ హైస్కూల్ సీలేరులో ఉంది. ఈ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 175 మంది విద్యార్థులున్నారు. జూన్ 12న పాఠశాల పునఃప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ ఉపాధ్యాయులు లేరు. ఈ పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులను బదిలీలపై వేరే ప్రాంతాలకు పంపించేశారు. వారి స్థానంలో ఇప్పటివరకు కొత్తవారిని నియమించలేదు. దీంతో పాఠశాలకు విద్యార్థులు వచ్చి మధ్యాహ్న భోజనం చేసి ఆడుకొని వెళ్తున్నారు తప్ప చదువులు మాత్రం సాగడం లేదు. దీంతో తమ భవిష్యత్తు ఏమిటో వారికే అర్థం కాక రోజులను కాలయాపన చేస్తున్నారు.



తరగతులు జరగక ఆరుబయట ఆడుకుంటున్న విద్యార్థులు



సీలేరు జెడ్పీహెచ్‌ఎస్

గత విద్యా సంవత్సరంలో ఇలా

సీలేరు జిల్లా పరిషత్ హైస్కూల్లో గతేడాది ప్రధానోపాధ్యాయుడు, పీఈటీ, సోషల్. లెక్కలు–ఇద్దరు. సైన్స్, ఇంగ్లిష్, తెలుగు, పీఎస్ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉండేవారు. ఈ విద్యా సంవత్సరంలో వేసవి సెలవులు అనంతరం కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియను ప్రారంభించింది. దీంతో మన్యంలో చాలా పాఠశాలల్లోని ఉపాధ్యాయులందరికీ బదిలీ చేసింది. వారందరూ వేర్వేరు ప్రాంతాలకు వెళ్లారు. ఇందులో భాగంగా సీలేరు జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిపోయారు. దీంతో ఇక్కడ హెచ్‌ఎంతో పాటు తెలుగు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఎంపీఎస్ కేటగిరీ ఉపాధ్యాయురాలు సూర్యకుమారిని గూడెంకొత్తవీధి మండల కేంద్రం నుంచి సీలేరు జెడ్పీ హెచ్‌ఎస్‌కు డిప్యూటేషన్‌పై తీసుకొచ్చారు. ప్రస్తుతం ఇద్దరు మాత్రమే ఉపాధ్యాయులున్నారు. తరగతులు సక్రమంగా జరగకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఈ విషయంపై ఎంఈవో రామన్న మాట్లాడుతూ సీలేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో నియమించేందుకు ఇప్పటికే జిల్లా డీఈవోకి తెలియజేశామన్నారు. ఉపాధ్యాయుల భర్తీతో అన్ని సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయులు నియమించేలా చర్యలు తీసుకుంటాము.



పాఠాల బోధన లేక ఖాళీగా కూర్చున్న విద్యార్థులు

మా పిల్లల భవిష్యత్ ఏమిటి



సీలేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తక్షణమే ఉపాధ్యాయులను తక్షణమే నియమించాలి. పాఠశాలలు పునఃప్రారంభం నుంచి విద్యార్థులకు పూర్తిస్థాయిలో తరగతులు జరగడం లేదు. దీంతో మా పిల్లల భవిష్యత్తు ఏమి కావాలి. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ద్వారా ఇక్కడి పాఠశాలకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు నియమించాలి.

– బుజ్జి, విద్యార్థి తండ్రి, సీలేరు

అయోమయంలో పదో తరగతి విద్యార్థులు

సీలేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడింది. పాఠశాల తెరిచి నేటికీ రెండు నెలలు పూర్తవుతున్నా ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠాలు జరగడం లేదు. పాఠశాలకు వచ్చి వెళ్లిపోతున్నారు. గతేడాది ఇదే పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణశాతం బాగా దిగజారింది. ఉపాధ్యాయులు లేక..పాఠాల బోధన లేక తమ పిల్లల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో ఉపాధ్యాయలను నియమించాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని వారు చెబుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పాడేరు: వెలుగు యానిమేటర్ల(వీఓఏ)ల సంఘం జిల్లా రెండో మహాసభ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం మినుములూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యానిమేటర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలిగా ఆర్.భాను(పాడేరు), ప్రధాన కార్యదర్శిగా ఎల్.బి.రాజీకుమార్(అరకు), కోశాధికారిగా పోతురాజు(హుకుంపేట), ఉపాధ్యక్షుడిగా భాస్కర్‌రావు(డుంబ్రిగుడ), సంయుక్త కార్యదర్శిగా జ్యోతి(ముంచంగిపుట్టు)తో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్య ఉద్యమాలు చేపడుతామన్నారు. నాయకులు సుందర్ రావు, పోతురాజు పాల్గొన్నారు.

కన్నబాబు తండ్రికి వైఎస్సార్‌సీపీ నేతల నివాళి



కాకినాడలో సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కొయ్యూరు: మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు తదితరులు శనివారం కాకినాడలో మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు తండ్రి దివంగత సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైస్ ఎంపీపీలు అంబటి నూకాలు, అప్పన వెంకటరమణ, చింతపల్లి ఏఎంసీ మాజీ చైర్మన్ జె.రాజులమ్మ, నాయకులు గాడి సత్యనారాయణ, జల్లి బాబులు, అచ్చిరాజు, నారాయణ, బాబ్జీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైఎస్సార్ వర్ధంతిని విజయవంతం చేయండి



- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయటౌన్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని సెప్టెంబర్ 2న నిర్వహించనున్నట్టు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం చెప్పారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ వాడవాడలా వైఎస్సార్ వర్ధంతిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నియజకవర్గంలోని ఆరు మండలాల్లోని గ్రామ గ్రామాల్లో మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించాలన్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ఆత్మీయ సన్మానం



ఉద్యోగ విరమణ పొందిన డివిజనల్ పీఆర్వో రాములును సన్మానిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : డివిజనల్ పౌర సంబంధాల అధికారిగా పండు రాములు అందించిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. డివిజనల్ పీఆర్వో రాములు, డ్రైవర్ కన్నబాబు ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం తన కార్యాలయంలో ఇరువురికి దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. పదవీ విరమణ పొందిన పీఆర్వో రాములు మాట్లాడుతూ అందరి సహకారంతో తాను 30 ఏళ్లు విజయవంతంగా విధులు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. తనకు సహకారం అందించిన అధికారులు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. డీపీఆర్వో కె.బి.ఎం.సింగ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సంధ్యారాణి, సిబ్బంది పుష్ప, వరలక్ష్మి, బహదూర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి



అనుబంధ కమిటీలో నియామకమైన నాయకులు

గూడెంకొత్తవీధి: వైఎస్సార్‌సీపీ లక్కవరపుపేట పంచాయతీ అనుబంధ కమిటీలను శనివారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్ నియమించారు. పార్టీ పంచాయతీ అధ్యక్షుడిగా బురిడి చిన్నభాయి. ప్రధాన కార్యదర్శులుగా వంతల నారాయణరావు, కంకిపాటి ప్రసాదరావు, రైతు విభాగం అధ్యక్షుడిగా కంకిపాటి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శులుగా జోగిదొర, కూనిశెట్టి రాంబాబు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా మచ్చల రాజకుమారి, ప్రధాన కార్యదర్శులుగా రామలక్ష్మి, రాజులమ్మ, యూత్ అధ్యక్షుడిగా కొర్రా రమణ, విద్యార్థి విభాగ అధ్యక్షుడిగా వంతల సూరిబాబు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా గెమ్మెలి లివిరి, క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడిగా కొర్రా గోపి, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడిగా సీందెరి లక్ష్మణ్‌ను నియమించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

ఎంపీపీ బోయిన కుమారి, నియోజవర్గ రైతు విభాగ అధ్యక్షుడు కంకిపాటి రామారావు, వైస్ ఎంపీపీ దేముడు, సర్పంచ్‌లు కె.రామకృష్ణ, వీరేంద్రప్రసాద్, నాగులమ్మ, ఎంపీటీసీలు మొట్టడం సత్య నారాయణ, కృష్ణమూర్తి, అరుణ్‌కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రత్యేక మండల కేంద్రాల కోసం డిమాండ్



గోమంగిలో ర్యాలీ చేస్తున్న నాయకులు, స్థానికులు



ధారకొండలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న స్థానికులు

పెదబయలు: మండలంలోని గోమంగి కేంద్రంగా ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలని గోమంగి మండల సాధన సమితి అధ్యక్షుడు సల్లంగి ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, మాజీ ఎంపీపీ జర్సింగి సూర్యనారాయణ, నాయకులు డిమాండ్ చేస్తూ శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు కేంద్రంగా ఉన్న గోమంగిలో మండల కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో పెదబయలు మండలం గోమంగికి రోడ్డు లేని కారణంగా ఒడిశాకు అనుకుని ఉన్న పెదబయలులో మండలం ఏర్పాటు చేశారని, గోమంగి కేంద్రంగా మండలం ఏర్పాటు చేస్తే 17 గ్రామ పంచాయతీలకు కేంద్రంగా ఉంటుందన్నారు. పెదబయలు మండల కేంద్రానికి శివారు గ్రామస్తులు వచ్చేందుకు 45 నుంచి 50 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని, అన్ని ప్రాంతాలకు సమీపంలో ఉన్న గోమంగిని మండల కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. గోమంగి ప్రత్యేక కేంద్రం కోసం పోరాటం ఉధృతం చేస్తామన్నారు. నాయకులు పృద్వీరాజు, సూర్యనారాయణ, రాధాకృష్ణ, భాస్కరరావు, కళ్యాణం, చిట్టిబాబు, సత్తిబాబు, జమ్మునాయుడు, నవీన, అప్పన్న చిట్టిబాబు పాల్గొన్నారు.

సీలేరు: ప్రస్తుతం ఉన్న మండల కేంద్రానికి అత్యంత మారుమూల ప్రాంతంలో ఉన్న ధారకొండ పంచాయతీ కేంద్రాన్ని మండల కేంద్రంగా ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ధారకొండ సాధన కమిటీ ఆధ్వర్యంలో శనివారం గ్రామస్తులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సీలేరు. దుప్పులువాడ, దారకొండ, గుమ్మరేవులు పంచాయతీలు మండల కేంద్రానికి చాలా దూరంలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి ధారకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని కోరారు. నాయకులు విష్ణుమూర్తి, ఉమామహేశ్వరరావు, పోతురాజు, కృష్ణ, సర్పంచ్ దుర్గో, శ్రీనివాసు.జగన్.అల్లంగి రాజు. సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం



పెదబయలులోని ఊరేగింపులో థింసా నృత్యం చేస్తున్న మహిళలు

పెదబయలు: మండలంలో పలుచోట్ల గణేష్ నిమజ్జన కార్యక్రమాలు శనివారం ఘనంగా జరిగాయి. ఊరేగింపులో థింసా నృత్యాలు చేశారు. బాణసంచా కాల్చారు. గ్రామాల్లో సందడి నెలకొంది. మండల కేంద్రంలో వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో 5 కిలోల లడ్డూ వేలంపాట నిర్వహించారు. గ్రామస్తుడు రాజు రూ.6వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

ఉత్సవ కమిటీ సభ్యులు సూరిపడాల్, జీవన్‌కుమార్, అర్జున్, అజయ్, చిరంజీవి, రూడ లక్ష్మణరావు, నీలయ్య, అంజిబాబు, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేయాలని వినతి



ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

చింతూరు: మండలంలో వరదముంపునకు గురైన గ్రామాలకు చెందిన ప్రజలకు నిత్యావసర సరకులు అందచేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర సరకులు కొనేందుకు రహదారులు లేక పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామాల్లో వ్యాధులు కూడా ప్రబలుతున్నాయన్నారు. ప్రజలకు నిత్యావసర సరకులు అందచేయడంతో పాటు మందులు, దోమతెరలు పంపిణీ చేయాలని కోరారు. నాయకులు వెంకట్, సురేష్, లక్ష్మణ్, రాజయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో ఎస్‌ఐ జె.రామకృష్ణ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంత పరిసరాల్లో పోలీసులు గస్తీ నిర్వహించారు. సంతకు వచ్చి, వెళ్లే వాహనాలు, ప్రయాణికుల లగేజీలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో అనుమానస్పదంగా వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వవద్దన్నారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళన



జిల్లా ఆస్పత్రి మాతా, శిశు విభాగం వద్ద నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

పాడేరు : జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, దీనిపై దశలవారీగా ఉద్యమాలు చేస్తామని పారిశుధ్య కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.ముత్యాలమ్మ స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం కొద్ది సేపు జిల్లా ఆస్పత్రి మాతా, శిశు విభాగం ఎదుట నిరసన చేపట్టారు. సమస్యల పరిష్కారించాలని నినదాలు చేశారు. ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు 2024 నవంబర్ నుంచి పెంచిన వేతనాలు రూ.18,600 వెంటనే చెల్లించాలని ఏరియర్స్ చెల్లించాలని, డ్యూటీ చార్ట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్, ఈఎస్‌ఐ తప్పిదాలను సరిచేయాలన్నారు. ప్రతి నెల మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని, గ్రూప్ ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని, వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని సేఫ్టీ పరికరాలను ఇవ్వాలన్నారు. పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు పుణ్యవతి, భూషణ్, చిట్టిబాబు, నగేష్, మణి, మధులత, చిలకమ్మ, సీతా తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు



జీకే వీధిలో గంబూషియా చేపలను చెరువులో విడుదల చేస్తున్న వైద్యులు



చింతపల్లిలోని బావిలో గంబూషియా చేపలను వేస్తున్న సబ్ యూనిట్ అధికారి చిట్టిబాబు

గూడెంకొత్తవీధి: మండలంలోని పెదవలస పీహెచ్‌సీకి సమీపంలో ఉన్న చెరువులో గంబూషియా చేపలను వైద్యుడు పృథ్వీషా చేతుల మీదుగా వదిలారు. ఆమె మాట్లాడుతూ గంబూషియా చేపల మూలంగా లార్వా తగ్గిపోతుందని, దోమల పెరుగుదల నిలిచిపోతుందన్నారు. దోమల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ రెండో విడతలో మండలానికి సంబంధించి 131 గ్రామాల్లో ఈ కార్యక్రమం పూర్తి చేస్తామన్నారు. టెక్నికల్ సూపర్‌వైజర్లు శ్రావణి, సంధ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి: దోమల ఉధృతి తగ్గించేందుకు లార్వా దశలలోనే నియంత్రించే విధంగా చర్యలు చేపడుతున్నట్టు సబ్ యూనిట్ అధికారి బుక్కా చిట్టిబాబు తెలిపారు. మండలంలోని చెరువులు, పాడుపడ్డ బావుల్లో లార్వాను నియంత్రించేందుకు గంబూషియా చేపలను విడిచిపెడుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడుపడ్డ బావులు చెరువుల్లోనే ఈ లార్వా ఎక్కువగా వృద్ధి చెందుతుందని, దీంతో దోమలు సంఖ్య విపరీతంగా పెరిగే అవకాశం ఉందన్నారు. దీనిని ప్రాథమిక దశలోనే నియంత్రించే విదంగా ప్రభుత్వం గంబూషియా చేపలను పంపిణీ చేసిందన్నారు. వీటిని గ్రామాల్లోన చెరువులు, బావుల్లో లార్వాను ఆహారంగా తీసుకునే విధంగా విడిచి పెట్టడం జరుగుతుందన్నారు. వీటితో దోమలు ఉధృతి తగ్గుతుందన్నారు. మండలంలో లంబసింగి, తాజంగి, లోతుగెడ్డ, కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో బావులు, చెరువుల్లో గంబూషియా చేపలను వేసినట్టు చెప్పారు. ఎంటిఎస్ గుమ్మ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



బంగారుమెట్ట చెరువులో గంబూషియా చేపలను వదులుతున్న వైద్యాధికారి నిఖిల్

పెదబయలు: మండలంలోని పెదబయలు పీహెచ్‌సీ పరిధిలోని సీకరి పంచాయతీ బంగారుమెట్ట, అరడకోట పంచాయతీ చెరువువీధి గ్రామాల్లోని చెరువుల్లో గంబూషియ చేపలను వేసినట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ యాంటీ లార్వా ఆపరేషన్‌లో భాగంగా గంబూషియ చేపలు వేసినట్టు చెప్పారు. గ్రామాల్లో దోమలు వృద్ధి చెందకుండా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నాగేశ్వరరావు, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ పాల్, హెల్త్ అసిస్టెంట్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్య అభ్యసించాలి

చింతపల్లి: వంగసార బాలికల ఆశ్రమ పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంఈవో బోడంనాయుడు మాట్లాడుతూ బాలికలు ఉన్నత విద్య అభ్యసించాలన్నారు. వాసవ్య మహిళా మండలి సభ్యులు, టీచర్లు పాల్గొన్నారు.